క్లుప్తంగా

నేడు భైంసాలో ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్పీ జి.జానకీ షర్మిల అందుబాటులో ఉండి భైంసా డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని క్యాంప్ కార్యాలయ అధికారులు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన

సారంగాపూర్: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతులు యూరియా బస్తాల కోసం ఆందోళన నిర్వహించారు. 12 టన్నుల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు కార్యాలయం వద్దకు తరలివచ్చారు. కొంతసేపటికే బస్తాలు అయిపోవడంతో ఎదురు చూసిన రైతులు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల్లో యూరియా వస్తుందని పీఏసీఎస్ అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

లోకేశ్వరంలో భారీ వర్షం



గొడిసెరాలో నేలవాలిన వరి పంట

లోకేశ్వరం: మండలంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురువడంతో రోడ్లు, పలు కార్యాలయాలు జలమయం అయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేన్లలో నీరు నిలిచి వర్షపు నీరంతా పంట పొలాల్లో నుంచి పారడంతో గండ్లు ఏర్పడ్డాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మొరం ట్రాక్టర్లకు జరిమానా

నర్సాపూర్(జి): అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీకాంత్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని దేవుని చెరువు దారిలో అనుమతుల్లేకుండా మొరం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆర్ఐ నవత జ్యోతి, రెవెన్యూ సిబ్బంది పట్టుకొని ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇంటిపై పిడుగు.. తప్పిన ముప్పు



పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శ్రీనగర్ కాలనీలో మూటపూర్ రవి ఇంటిపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు. పాక్షికంగా ఇంటి దిమ్మెలు కూలిపోయాయి. కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు.

డీఈవోను కలిసిన యాజమాన్యం



డీఈవో భోజన్నను సన్మానిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: నూతన డీఈవోగా బాధ్యతలు చేపట్టిన భోజన్నను మంగళవారం లక్ష్మణచాందకు చెందిన ద్రోణ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఇందులో కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి, హెచ్‌ఎం గంగాధర్, ముత్యం, శ్రీనివాస్ ఉన్నారు.

వీడీసీ కార్యవర్గం

లోకేశ్వరం: మండలకేంద్రంలోని వీడీసీ(గ్రామాభివృద్ధి కమిటీ) కార్యవర్గాన్ని సంఘ భవనంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా నీలగిరి గంగాధర్, క్యాషియర్‌గా ఉప్పి నాగేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కపిల్, శ్రీధర్, రాంచంధర్‌రావు, రవీందర్, రామారావు, సవీన్, నవీన్, మురళీ, జయసాగర్‌రావు, విజయ్‌రావు ఉన్నారు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

తానూరు: లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామ శివారులో బీరప్ప మందిరం గోపురాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని తానూరు మండల కుర్మ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్‌నాథ్‌కు, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. కుర్మ కులస్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పిరాజీ, తొండాల మాజీ సర్పంచ్ లక్ష్మణ్, ఇరేశ్, అశోక్, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వృథాగా సెగ్రిగేషన్ షెడ్లు

- నామమాత్రంగా తడి, పొడి చెత్త సేకరణ
- రోడ్లపైనే చెత్తాచెదారం
- నిర్వహణ లోపంతో నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



ముధోల్‌లో జలశంకర ఆలయం వెనుక చెత్త



తరోడాలో నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది..పంచాయతీలకు సేంద్రియ ఎరువు ద్వారా ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు ముధోల్ మండలంలో నిరుపయోగంగా మారాయి. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ ట్రాక్టర్‌లో సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాల్సిన పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను గ్రామాల శివారు ప్రాంతాల్లో పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లడంతోపాటు పలు చోట్ల వ్యర్థాలను కాలుస్తుండటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ముధోల్

ప్రతి గ్రామపంచాయతీకి శివారులో ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్డు, డంపింగ్‌యార్డును పక్కపక్కనే నిర్మించింది. వీటి నిర్వహణను పట్టించుకునేవారు కరువయ్యారు. ముధోల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వం ఉపాధిహామీ, స్వచ్ఛభారత్ నిధులతో డంపింగ్‌యార్డులు, వర్మీ కంపోస్టు(సెగ్రిగేషన్) షెడ్లను ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో టైప్–1 షెడ్లకు రూ.1 నుంచి రూ.2 లక్షలు, టైప్–2 షెడ్ల ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు.

నిర్వహణ ఇలా..

గ్రామస్తులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులు వేర్వేరుగా సేకరించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను డంపింగ్‌యార్డు వద్ద పడేసి మిగిలిన వ్యర్థాలను వర్మీ కంపోస్టు షెడ్డుకు తరలించాలి. షెడ్డు అరలలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలి. ఈ సేంద్రియ ఎరువులను రోడ్ల పక్కన నాటిన మొక్కలకు ఎరువుగా అందించాలి. మిగిలిన ఎరువులను గ్రామ రైతులకు విక్రయించి వచ్చిన సొమ్మును గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలి. ప్లాస్టిక్ వ్యర్థాలనూ విక్రయించాలి.

జరుగుతుంది ఇలా..

మండలంలోని పంచాయతీల్లో చాలా వరకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులు, కంపోస్టు యార్డులో నామమాత్రంగానే పడేస్తున్నారు. అధికభాగం ఖాళీ ప్రదేశాలు, చెరువులు, కుంటలు, వాగుల వద్ద పడేసి తగులబెడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కొందరు కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ముధోల్ మండలకేంద్రంతోపాటు 19 గ్రామపంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.

– శివకుమార్, ఎంపీడీవో

చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అప్పట్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. మొదట్లో కొన్ని రోజుల పాటు ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించారు. ఆ తర్వాత తడి, పొడి చెత్తను ఒకే బుట్టలో వేసి అందించడంతో పారిశుద్ధ్య కార్మికులు సైతం ఆ విధంగానే తీసుకోవడం ప్రారంభించారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సోన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్క్‌అవుట్, బేస్‌మెంట్ తదితర నిర్మాణ దశలపై చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30లోగా అనుమతులు పొందిన అన్ని ఇళ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణాల దశ ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నిరంతరం ఇళ్ల నిర్మాణ పనులు పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో 9,161 ఇళ్లు..

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో 9,161 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. (ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున, పీవీటీజీలకు ప్రత్యేకంగా) ఇందులో 60 శాతం మార్క్‌అవుట్లు పూర్తవగా 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పునాది స్థాయి వరకు వచ్చిందన్నారు. ఇప్పటివరకు రూ.24 కోట్ల 68 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అదనపు ఆర్థికసాయం కావాల్సిన వారికి స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) సుమారు రూ.3 కోట్లు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. గత 45 రోజుల్లో 20 రోజులు భారీ వర్షాలు కురిసినప్పటికీ.. అవసరమైన సహకారం అందిస్తామని లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. సమస్యలుంటే ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని లబ్ధిదారులకు సూచించారు. వదంతులు నమ్మవద్దని.. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేస్తే బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవో సురేశ్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా 'అమ్మ'



నిర్మల్‌లోని శ్రీగిరి నందిగుండం దుర్గాదేవి ఆలయంలో భక్తుల సందడి



కుంటాల: లింబా(కె)లో మండపం వద్ద..



లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో భక్తుల పూజలు

నిర్మల్‌టౌన్/మామడ/కుంటాల/సారంగాపూర్/లక్ష్మణచాంద: జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మామడ మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంలో వీధుల గుండా ఊరేగించారు.



సారంగపూర్: జామ్ ఆదర్శ కాలనీలో..



మామడ : ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కొండచిలువ హతం



కొండచిలువను హతమార్చిన గ్రామస్తులు

కడెం: మండలంలోని మారుమూల మిద్దెచింత గ్రామంలోని జనవాసాల్లోకి కొండచిలువ వచ్చి గ్రామస్తులను భయాందోళనకు గురిచేసింది. సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన సోయం అచ్చంతరావు ఇంటి ఆవరణలోకి కొండ చిలువ వచ్చి కోడిని మింగింది. స్థానికులు గమనించి కర్రలతో దానిని హతమార్చారు. మిద్దెచింతలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాములు, తేళ్లు తదితర విషపురుగులు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

అగ్రిమెంట్లు అందజేత

దస్తురాబాద్: ఆయిల్‌పాం సాగు చేస్తున్న మండలంలోని రైతులకు మంగళవారం ప్రీయూనిక్ కంపెనీ వారు ఒప్పందపత్రాలను అందించారు. ఖానాపూర్ ప్రీయూనిక్ క్లస్టర్ అధికారి నవీన్ మాట్లాడుతూ మండలంలో 143 మంది రైతులు 257 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో తిరుపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నర్సాపూర్(జి): హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేనావత్ రవి నాయక్‌ను మంగళవారం మండలంలోని నందన్‌తాండ గ్రామానికి చెందిన గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాదవ్ అఖిలేశ్ సన్మానించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు అఖిలేశ్ పేర్కొన్నారు.

ఆలయం సందర్శన

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయాన్ని మంగళవారం లోకేశ్వరం మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామస్తులు సందర్శించారు. ఇటీవల పిడుగుపాటుతో దెబ్బతిన్న ఆలయాన్ని పరిశీలించి సంఘటనకు పలు వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ముధోల్: మండలకేంద్రంలోని తానూర్ బైపాస్ రోడ్డులో మంగళవారం ఎస్సై బిట్ల పెర్సిస్ వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురి వాహనదారుల ధ్రువపత్రాలు పరిశీలించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

రెండోరోజు పోలీసుల గాలింపు

భైంసారూరల్: మండలంలోని బిజ్జూర్–బాబుల్‌గాం గ్రామాల మధ్య వాగులో సోమవారం గల్లంతైన లక్ష్మీబాయి కోసం మంగళవారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, పోలీసు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించాయి. ప్రజలు వెతికినా లక్ష్మీబాయి జాడ కానరాలేదు. సాయంత్రం కురిసిసన వర్షంతో వరద రావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. నీటి ఉధృతి తగ్గగానే మళ్లీ గాలింపులు చేపడుతామని సీఐ నైలు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం

కుంటాల: మండలంలోని అంబకంటిలో తాగునీటి సమస్యను గ్రామస్తులు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం ఎల్లమ్మ ఆలయ ఆవరణలో బోరుబావి వేయించి సమస్య పరిష్కరించారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ముధోల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రచన అన్నారు. మంగళవారం ఆమె ముధోల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్యాటరీపంపులు–179. పవర్ స్ప్రేయర్లు–30, రోటవేటర్లు–18, సీడ్ డ్రిల్–5, డిస్కహారో, కల్టివేటర్ నాగలి, కేజ్ వీల్స్ రోటోపడ్లర్లు–16, పవర్ వీడార్–5, పవర్ టిల్లర్–2, బ్రష్ కట్టర్–3 ఉన్నాయన్నారు. సన్నకారు రైతులకు 50శాతం, పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీపై పరికరాలు అందిస్తామని పేర్కొన్నారు.

లోకేశ్వరం: ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్ల కోసం వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో గిరిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరి స్ప్రేయర్లు–179, పవర్ స్ప్రేయర్లు– 30, రోటవేటర్లు–13, సీడ్ డ్రిల్–01, కేజీవీల్స్ రోటోపడ్లర్లు–16, పవర్ వీడార్–01, బ్రష్‌కట్టర్లు–03, పవర్ టిల్లర్–02 కోసం మహిళా సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

గుంతలు పూడ్చిన యువకులు



లక్ష్మణచాంద : గుంతలు పూడుస్తున్న యువకులు

లక్ష్మణచాంద: నిర్మల్‌రూరల్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లీ నుంచి లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామాల నడుమ జాతీయ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో రత్నాపూర్‌కాండ్లీ గ్రామ యువకులు మంగళవారం సొంతంగా ఇసుక, కంకర, సిమెంట్‌ను ట్రాక్టర్‌లో తీసుకెళ్లి సుమారు 20 వరకు గుంతలు పూడ్చివేశారు. దీంతో యువకులను పలువురు అభినందించారు. నరేశ్, హరీశ్, మోహన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కుంటాల: ఇటీవలి వర్షాలకు మండలంలోని కల్లూరు–అందకూర్ గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అందకూర్ గ్రామ యువకులు మంగళవారం శివారులోని గుంతలు పూడ్చి శ్రమదానం చేశారు.

ఎమ్మెల్యే కృషితో నిర్మల్ పట్టణాభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కృషితోనే నిర్మల్ పట్టణం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్మల్ పట్టణం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నిర్మల్ పట్టణ అభివృద్ధికి రూ.57 కోట్ల నిధుల మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికే దక్కిందన్నారు.సీసీ రోడ్లు డ్రెయినేజీలకు రూ.15 కోట్లు, కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత మిషన్ పథకం ద్వారా ఎస్‌టీపీ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.42కోట్లు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గాన్ని రూ.వందల కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేయిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, ఆకుల కార్తీక్, ఆడేపు సుధాకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, తాజా మాజీ కౌన్సిలర్లు చిన్నయ్య, సాదాం అరవింద్, శంకరపతి, పద్మాకర్, నాయకులు రవి, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పకడ్బందీగా చేపట్టాలి



ధర్మోరలో ఇళ్లకు ముగ్గు పోయిస్తున్న అధికారి

తానూరు: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సత్వరం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని భోసి గ్రామం సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో 27 మందికి ఇళ్లు మంజూరవగా.. కొందరు మాత్రమే పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. ఎంపీవో విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

ధర్మోరలో..

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మండలంలోని ధర్మోరలో 9 ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా మంగళవారం ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు మార్కౌట్ ఇచ్చారు. త్వరలో అన్ని ఇళ్ల పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భోగ్గుట నర్సయ్య, నాయకులు మంద భాస్కర్, రమేశ్‌గౌడ్, అబొద్దీన్ పటేల్, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, జీపీవో సులోచన ఉన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- ఓ ఎద్దు మృతి.. రైతుకు తప్పిన ప్రమాదం



మృతిచెందిన ఎద్దు, బండిని పరిశీలిస్తున్న ఆర్ఐ మోహన్ సింగ్, నాయకులు

తానూరు: మండలంలోని కోలూరులో సోమవారం సాయంత్రం కురిసిన భారీవర్షాలకు వాగులో ఎడ్లబండి కొట్టుకుపోగా రైతుకు ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం వల్కోడు సయాజీ ఎడ్లబండిపై వ్యవసాయ చేను వద్దకు వెళ్లాడు. పొద్దంతా ఎడ్లను మేపి సాయంత్రం ఇంటికి ఎడ్లబండిపై బయలుదేరాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రామ సమీపంలోని వాగును దాటుతుండగా ఓ ఎద్దు బండి కాడెను వదిలి వెళ్లిపోయింది. బండికే ఉన్న మరో ఎద్దు, రైతు వరద ప్రవాహానికి కొంతదూరం కొట్టుకుపోగా రైతు బయటపడి గ్రామానికి చేరుకున్నాడు. బండికే ఉన్న ఎద్దు ఊపిరాడక మృతిచెందింది. అధికారులకు సమాచారం అందించడంతో మంగళవారం ఆర్ఐ మోహన్‌సింగ్ ఘటన స్థలాన్ని వచ్చి వివరాలు తెలుసుకొని పంచనామా నిర్వహించారు. రూ.50 వేలు విలువ చేసే ఎద్దు మరణించిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రోదించసాగాడు.

గుంత.. ఆదమరిస్తే అంతే



మామడ: మండలంలోని దిమ్మదుర్తి నుంచి నల్దుర్తి గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.